
దాడులతో ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. ప్రతాపరుద్రుని వీరమరణవార్త ఆంధ్ర రాజ్యాన్ని కుదిపేసింది. ఏమవుతున్నదో తెలిసేలోగా.. జనజీవనం అస్తవ్యస్తమై, సర్వనాశనం మొదలయ్యింది. ఏదో ఓ పురంలో.. ఓ వీధిలోకి ఓ ముష్కరుల ముఠా వచ్చి పడుతుంది. వీధుల్లో ఉన్న ఆవులు, గేదెలు, గుర్రాలను తోలుకుపోతారు. ఇళ్లలోకి చొరబడతారు. నగానట్రా గుంజుకుంటారు. ఆడవాళ్లతో అసభ్యంగా ప్రవర్తిస్తారు. మగవాళ్లు ఏమైనా అంటే.. వాళ్లముందే ఆ స్త్రీలను మానభంగం చేస్తారు. ఆనక చంపేస్తారు. ఈ దుష్కృత్యాలను చేస్తున్న వాళ్లు ఈ రాజ్యపాలకులే అంటే ఎంత దౌర్భాగ్యం?!

రాజధాని ఓరుగల్లు నుంచి అట్టడుగు పట్టణం కంచి వరకు.. సమస్త ఆంధ్ర రాజ్యమంతటా ఇదే అరాచకం!

ఆంధ్రసామ్రాజ్యం విషాదవిహ్వలతతో చిగురుటాకులా వణికిపోతుండగా.. ముందు మేల్కొన్నవాడు కాకతీయ మహాప్రధాని కొలని రుద్రదేవుడు. ఏడేళ్ల యుద్ధాలలో ప్రముఖులంతా నేలకొరగగా.. మిగిలిన పాతిక మంది వీరసేనానులతో మిత్రసమాఖ్య ఏర్పాటుచేశాడు.



ఇందులో అన్నయ మంత్రి, కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమనీడు పెద్దలు కాగా.. మిగిలిన వారు వారివారి ప్రాంతాలలో మండలేశ్వరులు, నాయంకరులు. తురుష్కులపై పోరాటానికి, ఆంధ్రరాజ్య ప్రజల మాన, ప్రాణ రక్షణకు తమ ప్రాణాలు ధారపోయడానికి సిద్ధమైన యోధానుయోధులు.

కాకతీయవంశం అంతరించగానే ఆంధ్రసామ్రాజ్యం చిన్నచిన్నరాజ్యాలుగా విడిపోయింది. సమాఖ్య మిత్రులు ఒకరికొకరు సహకరించుకోగా.. మొహమ్మద్ అనే తురక సర్దార్‌ను వెళ్లగొట్టి, కంచినుంచి నెల్లూరు వరకు ఉన్న మొరసునాడు ప్రాంతాన్ని ఆరవీడు నాయంకరుడు సోమదేవరాజు స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నాడు. గుంటూరు, సింహపురి ప్రాంతాలను జయించి అద్దంకి రాజధానిగా రెడ్డిరాజ్యాన్ని స్థాపించాడు ప్రోలయ వేమారెడ్డి. ముసునూరు వంశజుడు ప్రోలయనాయకుడు తీరస్తప్రాంతాన్ని రేకపల్లి రాజధానిగా స్వతంత్ర రాజ్యం ఏర్పరిచాడు.

ఇక మిగిలింది సుల్తాన్‌పూర్ (ఓరుగల్లు) రాజధానిగా ఉన్న ప్రధాన ప్రాంతం. దానినే ఢిల్లీ పాలకులు, స్థానిక తురకలు తెలింగ లేదా త్రిలింగరాజ్యంగా పిలుస్తుండగా.. సాధారణ ప్రజల నోళ్లలో ఈపేరు తెలింగాణ – తెలింగాణా రాజ్యంగా స్థిరపడింది.

ఆ మూడు ప్రత్యేకరాజ్యాల స్థాపనలో కాపయ నాయకుడు పాల్గొన్నాడు. అందరికీ అతని వీరత్వం, యుద్ధ నైపుణ్యం, మంత్రాంగ పరిణతి నచ్చాయి. ఓరుగల్లు విముక్తికి అతనే సరైన సైన్యాధ్యక్షుడుగా అందరూ నిర్ణయించారు.

''ఆంధ్రప్రాంతాలలోని తురక సర్దారులంతా ఇప్పుడు ఓరుగల్లు చేరారు. ప్రజలను చిత్రవధ చేస్తున్నారు. వెళ్లు.. వెళ్లి అక్కడి మనమిత్రులతో చర్చించి విముక్తి ప్రణాళిక సిద్ధంచెయ్యి. ఓరుగల్లును నువ్వే విముక్తం చెయ్యగలవు. నీ వెనక మేము సదా సన్నద్ధంగా ఉంటాం!'' అన్నారు మిత్ర సమాఖ్య సభ్యులు.

ఓరుగల్లు విముక్తి కోసం రహస్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న వివిధ మండల సేనాబృందాలను కలిశాడు కాపయ.

''తెలింగాణ రాజ్యం కూడా ఢిల్లీ పాలకుల నుంచి విముక్తమై.. పూర్తి హిందూరాజ్యం కావాలి. ఈ వినాశనం ఇక్కడితో ఆగాలి. అందుకు ఏ పోరాటానికైనా నేను సిద్ధం!'' అన్నాడు కాపయ.

విచిత్రంగా కొద్దిమంది మాత్రమే చేతులు కలిపారు.

''వాళ్లతో నెగ్గడం కష్టం. కొంతకాలం రహస్య జీవనమే ఉత్తమం..'' అన్నారు చాలామంది.

నోరెళ్లబెట్టాడు కాపయ. ఇక్కడ మారణకాండ ఎంత తీవ్రంగా ఉందో.. వీరయోధులూ ఈ కిరాతకుల ధాటికి ఎలా పిరికి మంత్రం జపిస్తున్నారో అర్థం చేసుకున్నాడు.

* * *

ఓరుగల్లు పట్టణంలోని భోగేశ్వరాలయం.. ఒకప్పుడు కిక్కిరిసిన భక్తులతో 'హరోంహర!' నినాదాలతో దేవదేవుడే కొలువైనట్లుండే ఆ దేవళం.. ఇప్పుడు పూర్తిగా ధ్వంసమై రాళ్లకుప్పలా మిగిలిఉంది. తన సైనిక పటాలంతో కలిసి దేవళం వద్దకు వచ్చాడు సుల్తాన్‌పూర్ నగర సహాయ దండనాయకుడు తుర్రేఖాన్. ఓ ఎనుబోతును చంపి.. అక్కడే పచ్చి మాంసాన్ని తింటున్నారు ఆ సైనిక పటాలమంతా. అప్పుడు జరిగింది వాళ్లు ఊహించని మెరుపుదాడి..

కాపయ నాయకత్వంలో ఓ పెద్ద అశ్వికబృందం హఠాత్తుగా దాడి చేసింది. చేతిలో జంతుమాంసం ఉన్న సైనికులకు ఆయుధం పట్టుకునే అవకాశం ఇవ్వకుండా.. అశ్వికులు దాడి చేశారు. కత్తులు, బల్లాలు, గండ్రగొడ్డళ్లతో విరుచుకుపడి అందర్నీ నరికిపారేశారు. తుర్రేఖాన్ శిరసును ఒక్క ఖడ్గ ప్రహారంతో ఖండించిన కాపయ.. ఆ మ్లేచ్ఛుడి రక్తంతో భోగేశ్వర దేవరను అభిషేకించాడు. ఈ సంఘటన ఢిల్లీ పాలకులను నిబిడాశ్చర్యంలో ముంచింది. ఓరుగల్లులో ప్రవేశించిన ఆరుమాసాలకు కాపయ తన తొలిదెబ్బ రుచిచూపాడు. అతని సారథ్యంపై సందేహమున్న సాటి నాయంకర బృందాలకు తన అసాధారణ ప్రజ్ఞ చూపాడు.

మరో మూడుమాసాలు గడిచాక..

ఓరోజు అనుమకొండ వేశ్యావాటిక ముందు విటుడిగా ముస్తాబై పోతున్నాడు కాపయ. ఎవరి కోసమో నిశితంగా వెతుకుతున్నాడు.

''రండి బావగారూ! కుడికాలు పెట్టండి..'' అన్నాడొక పేడిమూతి యువకుడు.. కాపయతో, ఓ వేశ్యామందిరం వద్ద.

అతని వైపు దగ్గరగా జరిగి..

''నాకు ఇష్టమైన నామం పున్నగి. ఆ పేరుతో ఎవరైనా ఉంటే.. ఏర్పాటు చెయ్యగలవా?''.

'పున్నగి' పేరు వినగానే ఆ యువకుడు నిటారుగా మారి.. కాపయ వంక చురుగ్గా చూశాడు.

''మీరు.. తమరు!?''.

''ముందు పున్నగిని చూడాలి!''.

''కాస్త ముందుకుపోయి.. ఆ కుడి పక్క ఇంట్లోకి వెళ్లండి. ఎవరైనా చూస్తే ప్రమాదం!'' అన్నాడు ఆ యువకుడు.

అలాగే ఆ ఇంట్లోకి వెళ్లాడు కాపయ. అక్కడో యువతి. ఆమె కాపయను చూసి ఆశ్చర్యపోతూ..

''మీరు కాపయ నాయకులవారు కదూ!?'' అన్నది.

''నేనే పున్నగీ..'' అన్నాడు కాపయ తలవూపి.

ఆమె అతని కాళ్లపై పడిపోయి భోరున ఏడవడం ప్రారంభించింది. లేపి అర్ధ పల్యంకంపై కూర్చోబెట్టాడు.

''గొప్ప వీరయోధురాలివి. ఇలా వేశ్యగా మారావేమిటని నిన్ను ప్రశ్నించడం లేదు పున్నగి. తెలుగు సమాజం ఎప్పుడూ చూడనంత తీవ్రసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. శోకం నియంత్రణలో ఉండాలి. దుఃఖం.. శత్రువులపై పగగా మారాలి. అప్పుడే శత్రువును నిర్మూలించగలం!''.

కాపయ అనునయ వాక్యాలతో కాస్త తెప్పరిల్లి..

''ఓరుగల్లులో మా బతుకులు కుక్కలకన్నా హీనం. యోధుడు, సైనికుడంటే చాలు.. పెడరెక్కలు విరిచికట్టి కింద మంట పెట్టడం సర్వసాధారణం. ఇక మహిళాయోధురాలు అంటే.. ఈ మ్లేచ్ఛులకు అస్సలు పడదు. నా మహిళా దళాన్ని ఊచకొత కోసి.. మమ్మల్ని చిత్రహింసలు పెట్టారు. మా భర్తలను మతం మార్పించి.. మాకు తలాక్ చెప్పించి, వాళ్లను బానిసలుగా ఢిల్లీకి తీసుకెళ్లారు. చివరికి తిండిలేక.. బతికే మార్గంలేక ఈ వేశ్యవాడలో ఇలా!'' అని చెప్పుకొచ్చిందామె.

ఖిన్నుడై వంచిన తల ఎత్తలేకపోయాడు కాపయ.

రుద్రమదేవి తన కాకతీయ సైన్యంలో ఏర్పాటు చేసిన మహిళాదళం నాయకురాలు పున్నగి. ఆమె మనుమరాలే ఈ పున్నగి. కాపయలాంటి యోధులతో సమానమైన యుద్ధ ప్రవీణురాలు.

''సరే.. సరే! ముందు నీ మహిళాదళాన్ని తిరిగి సంఘటితం చెయ్యి. మనకు రెండు మహిళాదళాలు కావాలి. మీకు కావాల్సిన ఆర్థిక, రక్షణ సదుపాయాలు నేను ఏర్పాటు చేస్తాను. తర్వాతి ప్రణాళిక అప్పుడు ఆలోచిద్దాం!''.

అప్పుడే ఇద్దరు స్త్రీలు ఆ ఇంట్లోకి ప్రవేశించారు.

''ఈమె చందల. ఆమె వల్లిక'' అంటూ, వారిని పరిచయం చేసింది పున్నగి.

అవయవ సౌష్టవం కలిగిన అందాలరాశి చందల. దగ్గరగా వెళ్లి నుదుటునున్న కుంకుమను తుడిచివేశాడు. అందరూ మ్రాన్పడిపోయి చూస్తుండగా..

''నువ్వు ఢిల్లీ వెళ్లి తిరిగి రావాలి చందల.. పర్షియా సుందరిగా!'' అన్నాడు కాపయ.

లిప్తకాలం తర్వాత అర్థమై.. అందరూ నిట్టూర్పు